బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 07 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## ఆగస్టు 3న నీట్ పీజీ-2025 పరీక్ష

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

నీట్ పీజీ-2025 పరీక్షను ఆగస్టు 3న ఒకే షిఫ్టులో నిర్వహించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. ఈ మేరకు నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈ) చేసిన అభ్యర్థనకు భారత సర్వోన్నత న్యాయస్థానం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఎన్‌బీఈ ఈ అభ్యర్థనను చేసింది. ఈ ఏడాది మే 30న ఇచ్చిన తీర్పులో నీట్ పీజీని రెండు షిఫ్టుల్లో కాకుండా ఒకే షిఫ్టులో నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. నీట్ పీజీ-2025 పరీక్షను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలనీ, పారదర్శకత కొనసాగే విధంగా సురక్షితమైన కేంద్రాలను గుర్తించాలని మే 30న ఇచ్చిన ఉత్తర్వులో ఎన్‌బీఈని సుప్రీంకోర్టు ఆదేశించింది. రెండు షిఫ్టుల్లో నీట్ పీజీ పరీక్షను నిర్వహించడం వల్ల అసమాన పరిస్థితులు ఏర్పడతాయని, ప్రశ్నాపత్రాలు ఒకే ప్రమాణాలతో, కఠినంగా ఉండకపోవచ్చని కొంత మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించి సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అలాగే, ఎన్‌బీఈ వసూలు చేసిన పరీక్ష ఫీజును కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రతి జనరల్ కేటగిరీ అభ్యర్థి నుంచి రూ. 3,500, ఎస్సీ, ఎస్టీ వికలాంగ అభ్యర్థుల నుంచి రూ. 2,500 వసూలు చేయడాన్ని ప్రస్తావించింది. ఇంత భారీ ఫీజులు వసూలు చేశారు కాబట్టి, ఒకే షిఫ్ట్‌లో పరీక్షను సజావుగా నిర్వహించడానికి, తగిన సంఖ్యలో కేంద్రాల ను ఏర్పాటు చేయడానికి ఎన్‌బీఈ వద్ద తగినంత నిధులు ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొన్నది. దీంతో ఒకే షిఫ్టులో పరీక్షను నిర్వహించడానికి ఎన్‌బీఈ అదనపు సమయం కోరింది. తాజాగా ఆగస్టు 3ను ప్రతిపాదించింది.

# బీఆర్ఎస్ అసలు పేరు డీఆర్ఎస్

- దెయ్యాల రాజ్య సమితి
- ఆ పార్టీలోకి దెయ్యాలు చేరినట్లుగా బీఆర్ఎస్ నేతలే చెప్పారు
- దెయ్యాల పంచాయతీ తేల్చాలి
- అప్పటి ప్రధాని పీవీకే కమిషన్ ఎదుట హాజరు తప్పలేదు కేసీఆర్ స్థాయి ఎంత?
- టీటీడీ తరహాలో వైటీడీ ఏర్పాటు
- యాదగిరిగుట్టను టీటీడీ తరహాలో అభివృద్ధి చేస్తాం
- యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ అసలు పేరు డీఆర్ఎస్ అని డీఆర్ఎస్ అంటే దెయ్యాల రాజ్య సమితి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలు చేరాయని స్వయంగా ఆయన కుమార్తె కవిత ప్రకటించారని, అందువల్ల బీఆర్ఎస్‌లో ఉన్న దయ్యాలు ఎవరో తేల్చాలని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను దెయ్యాలుగా అభివర్ణించాలని అన్నారు.శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంతోపాటు సుమారు రూ.1051.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

తనను జైలుకు పంపిన వాళ్లను కచ్చితంగా గద్దె దింపుతానని రిలీజైనప్పుడు తొడగొట్టి ఛాలెంజ్ చేశానని అది చేసి చూపించానంటూ గర్వంగా చెప్పారు. నవంబర్ 11న తన జన్మదినం సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత మూసీ వెంట పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు. ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చి పనులు మొదలు పెట్టామని, కానీ మోకాళ్ల కట్టె పెట్టి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో యమునా నది, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి గంగానది ప్రక్షాళన చేస్తే తప్పు లేదుగానీ తెలంగాణలో మూసీ నది కాలుష్యం నుంచి ప్రజలను కాపాడుకుంటామంటే తప్పేంటని ప్రశ్నించారు. ఆరు నూరైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి గోదావరి నదీ జలాలతో నింపుతామని తెలిపారు. పదేండ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. ఎస్ఎల్బీసీకి, డిండికి నిధులు ఎందుకు ఇవ్వలేదని? ఎందుకు పూర్తి చేయలేదని ? ప్రశ్నించారు.

**యాదగిరిగుట్టను టీటీడీ తరహాలో అభివృద్ధి చేస్తాం**

రాష్ట్రంలో ఆధ్యాత్మికతకు కేంద్రంగా ఉన్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయం ఆధ్వర్యంలోని యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి బోర్డు ద్వారా మెడికల్ కాలేజీలు, విద్యా సంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళతామని వెల్లడించారు.

వైటీడీఏ ద్వారా దేశంలోనే విశిష్టమైన యూనివర్సిటీగా గుర్తింపు తెచ్చేలా విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తాం. గోశాలలు, ఆధ్యాత్మిక సేవలు, సంక్షేమ కార్యక్రమాలను టీటీడీ తరహాలో నిర్వహిస్తాం," అని అన్నారు.అలాగే, యాదగిరిగుట్టపై భక్తులు నిద్రించాలన్న సంప్రదాయాన్ని పునరుద్ధరించినట్లు, ఆలయ స్వర్ణ విమాన గోపురం నిర్మాణానికి 60 కేజీల బంగారం వినియోగించినట్లు తెలిపారు.

"గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో నల్గొండ జిల్లాలో ఒక్క అభివృద్ధి పనికీ శ్రీకారం చుట్టలేదు. ఆలేరు ప్రజల చిరకాల కోరిక గంధమల్ల ప్రాజెక్టును పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు ముంపు లేకుండా నిర్మాణం చేపడుతున్నాం," అని పేర్కొన్నారు. గోదావరి జలాలతో మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని, ఇందులో ఎలాంటి అడ్డంకులు సహించబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై కేబినెట్‌లో చర్చించి, పరిష్కారానికి తీసుకెళ్లామని చెప్పారు. మొదటి తేదీన జీతాల చెల్లింపుతో ఉద్యోగుల్లో ఉత్సాహం కనిపించిందని వెల్లడించారు.

"కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై కేసీఆర్‌కు నోటీసులు జారీ చేస్తే.. కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్ అని అంటారా? దేశానికి ప్రధానిగా చేసిన పీవీ నరసింహారావుకే ఒక సందర్భంలో కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ప్రధాని స్థాయి నాయకుడే కమిషన్ ఎదుట హాజరయ్యారు. కేసీఆర్ నువ్వు ఎంత.. నీ స్థాయి ఎంత అని" సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏండ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తెలంగాణ ప్రజలు దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములయ్యేలా నిలబెడతామని, జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలుపుతామని అన్నారు. దేశంలో వందేండ్లలో ఎవరూ చేయని విధంగా మొదటిసారి కులగణన చేపట్టి రాష్ట్రంలో 56.36శాతం బలహీన వర్గాలు ఉన్నారని లెక్కలు తీశామన్నారు. విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. ఆలేరు నియోజకవర్గం మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ కింద రూ. 54.70 కోట్ల చెక్కులను సీఎం చేతుల మీదుగా అందజేశారు. పలువురు లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వంపై పాకిస్థాన్ దాడి

- ప్రధాని మోడీ
- చీనాబ్ రైల్వే వంతెన ప్రారంభం
- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పెహల్గామ్‌లో పర్యాటకులను టార్గెట్ చేసి మానవత్వంపై, కశ్మీరీలపై పాకిస్థాన్ దాడి చేసినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. చీనాబ్ నదిపై బ్రిడ్జ్‌ను ఓపెనింగ్, వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపిన తర్వాత జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో మత కల్లోలాలు సృష్టించాలన్న ఉద్దేశంతో పాకిస్థాన్ ఉన్నట్లు ఆయన ఆరోపించారు. జీవనోపాధి కోసం పర్యాటకంపై ఆధారపడుతున్న కశ్మీర్ ప్రజలను పాకిస్థాన్ దోచుకున్నదని తెలిపారు. పర్యాటకం ఇక్కడ ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించిందని, ప్రజల మధ్య అది ఒక బంధాన్ని ఏర్పర్చుకున్నదని, కానీ దురదృష్టవశాత్తు, పొరుగుదేశం మానవత్వానికి, సామరస్యానికి, పర్యాటకానికి శత్రువుగా తయారైందని ఆరోపించారు. పాకిస్థాన్ పేదల కడుపు కొడుతున్నదని, ఏప్రిల్ 22న పెహల్గామ్‌లో జరిగింది అదే అని, పెహల్గామ్‌లో మానవత్వం, కశ్మీరతత్వంపై పాకిస్థాన్ అటాక్ చేసిందన్నారు. కశ్మీర్ ప్రజల ఆదాయాన్ని దోచుకునేందుకు టూరిస్టులపై పాక్ దాడికి పాల్పడిందన్నారు.

ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయ్యింది. బాంబు దాడులను సైతం బ్రిడ్జి తట్టుకుని నిలబడగలదు.

## తెలంగాణ నీటిహక్కుల కోసం రాజీలేనిపోరు

- అన్యాయం చేస్తే ఊరుకోం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తున్నదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్లపై తెలంగాణకు అన్యాయం చేస్తే ఉపేక్షిం చబోమని హెచ్చరించారు. ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. అంతరాష్ట్ర జలవిధానాలు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, నిర్మలా సీతారామన్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లేఖలు రాసినట్టు చెప్పారు. 'ఏపీ నుంచి ఎలాం టి ప్రతిపాదనలు రాలేదనీ, వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని చెప్పారు. చట్ట ప్రకారం ముందుకెళ్తామని హామీ' ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను లేఖలో వివరించామనీ, చట్టవిరుద్ధంగాఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు.. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంతవరకైనా పోరాడుతాం, తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామనీ, వెనక్కి తగ్గేదేలేదని వివరించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేండ్లు బీఆర్ఎస్ సహకరించింది. ఉమ్మడి కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు, ఏపీ బీఆర్ఎస్ హయాంలో ఏపీకి 1254 టీఎంసీలు తరలించారని గుర్తు చేశారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర కాకుండా మేడిగడ్డ వద్ద కట్టడంతో రూ.68వేల కోట్లు కాళేశ్వరానికి అదనపు ఖర్చు అయిందని చెప్పారు. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పలేదా ? కృష్ణా నీళ్ల విషయంలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని ఉత్తమ్ విమర్శించారు. ముచ్చుమర్రి ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ సర్కారు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు.

రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు తెలంగాణకు మరణశాసనమని వ్యాఖ్యానిం చారు. ప్రతిరోజూ మూడు టీఎంసీలను తరలించుకుపోతుంటే కేసీఆర్ సర్కారు తోడ్పడిందని చెప్పారు. జగన్‌తో అలయ్‌బలయ్ చేసుకుని, కృష్ణానీటి దోపిడికీ కేసీఆర్ సహకరించారని వివరించారు. ఏపీ దోచుకునేందుకు కేసీఆర్ సహకరించార ని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో కేసీఆర్, హరీశ్‌రావు ఏపీ కోసమే పనిచేశారని వివరించారు. రాయలసీమ ప్రాజెక్టు టెండర్లు పూర్తయ్యేవరకు తెలంగాణ కావాలనే ఆపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లలేదని గుర్తు చేశారు. జగన్-కేసీఆర్ రహస్య ఒప్పందంలో భాగంగానే తెలంగాణ అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లలేదని విమర్శించారు. బనకచర్లపై బీఆర్ఎస్ నేతలు పచ్చిఅబద్ధాలు చెబుతున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ రావు అని పేరు మార్చుకుంటే సరిపోతుందన్నారు. గోబెల్స్ బతికి ఉంటే, వీళ్లను చూసి నన్ను మించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారంటూ ఆశ్చర్యపోయేవారన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టుపై మౌనమేలా..?

- కాళేశ్వరం కాదంటే గంధమల్లకు నీళ్లెట్ల?
- ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు
- బీజేపీ ఎంపీలు కండ్లు తెరవాలి
- అబద్ధాలకు సీఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్**

గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుకు ఏపీ ప్రభు త్వం ప్లాన్ చేస్తుంటే తెలంగాణ బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు మౌనం వహించడం లో ఆంతర్యమేమిటని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆనంతరం దుబ్బాకలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ.. అపెక్స్ కమిటీ, అంతర్రా ష్ట్ర అనుమతి, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌ నంగా ఉంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబును ఎదురించే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లడం లేదని, ప్రధానిని కూడా ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. ఏపీ నీటి దోపిడీని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు ఇకనైనా కండ్లు తెరవాలని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని కోరారు. 400 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలిస్తుంటే ఇటు కాంగ్రెస్ ప్రభు త్వం, అటు కేంద్ర మంత్రులు గుడ్లప్పగించి చూస్తున్నారని విమర్శించారు. బనకచర్లతో గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ పూర్తయితే రోజుకు 90 వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారని వాపోయారు.కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్లే ఏపీ అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కండ్లు తెరిచి అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ సుప్రీంకోర్టుకు వెళుతుందని తెలిపారు. నీతి ఆయోగ్‌లో సీఎం రేవంత్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 'కృష్ణానదిలో న్యా యమైన వాటా కిందికి వదిలింది మీరు. గోదావరి-బనకచర్ల కడుతుంటే చేతులు కట్టుకుని చూస్తున్నది మీరు.శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే దానిని అపకుండా చూస్తున్నది మీరు కాదా?' అని ప్రశ్నించారు. గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలిస్తుంటే ప్రభు త్వం ఎందుకు స్పందించడం లేదని, దీనిపై ఉత్తమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశా రు. బీఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ చేతకానితనంతోనే పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని చెప్పారు. కేసీఆర్ కొట్లాడి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్-3 సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడ ర్ అయితే, మంత్రి ఉత్తమ్ ఆయనను మించిపోయారని హరీశ్ ఎద్దేవా చేశారు. గోబెల్స్ అనేవాడు ఉంటే ఉత్తమ్ అబద్ధాలు చూసి ఉరేసుకుని ఉండేవాడన్నారు.మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న కాంగ్రె స్ ప్రభుత్వం 500 రోజులు గడిచినా అమలు చేయలేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోబెల్స్ ప్రచారం తప్ప ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు.

## కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్**



కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదైంది. అయితే, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది.హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై ప్రతివాదిగా ఉన్న కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేటీఆర్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

## ఎనకౌంటర్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్ మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-నేషనల్ పార్క్ ప్రాంతంలో మళ్లీ మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య బీకర పోరు జరిగింది. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాలు ప్రకారం.. నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టులు సంచారం ఉందనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టగా.. మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో.. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మైలారపు ఆడేలు అలియాస్ భాస్కర్ మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పోచరా ఆయన స్వస్థలం. ఆయనపై 25 లక్షల రివార్డు ఉన్నట్టు ఎస్పీ వివరించారు. ఘటనాస్థలిలో ఏకే 47ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, డీఆర్‌జీఎస్‌టీఎఫ్, కోబ్రా, జవాన్లు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఏడీజీ వివేకానంద సిన్హా, బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, సీఆర్‌పీఎఫ్ ఐజీ రాకేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్పీ వివరించారు.

## గోల్డ్ లోన్ నిబంధనలను సడలించిన ఆర్‌బీఐ

**బలగం టీవి, హైదరాబాద్**

బంగారు రుణాల నిబంధనలలో ఆర్‌బిఐ పెద్ద మార్పు చేసింది. ఇది చిన్న రుణగ్రహీతలకు ఊరట కలిగించింది. రూ.2.5 లక్షల వరకు బంగారు రుణాలకు లోన్-టు-వాల్యూ (ఎల్‌టివి) నిష్పత్తిని 75 శాతం నుండి 85 శాతానికి పెంచాలని రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించింది. దీని అర్థం రూ. లక్ష విలువైన బంగారాన్ని తాకట్టు పెడితే, మునుపటి రూ. 75,000 కు బదులుగా, ఇప్పుడు రూ. 85,000 వరకు రుణం లభిస్తుంది. ఇది చిన్న వ్యాపారులు లేదా మధ్యతరగతి వారికి, తమ చిన్న అవసరాలను తీర్చుకోవడానికి బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే వారికి సులభతరం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఈ ప్రకటన తర్వాత బంగారు రుణాలు అందించే కంపెనీల షేర్లు పెరిగాయి.

## గోశాలలో మరో 2 కోడెలు మృతి : పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

తిప్పాపూర్ లోనీ గోశాలలో అనారోగ్యం తో ఉన్న కోడెలలో శుక్రవారం 2 కోడెలు మృత్యువాత పడ్డాయని, మిగిలినవి వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలో ఉన్న 1300 పశువు లలో ప్రస్తుతం మొత్తం 11 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యానికి కోడేలు స్పందిస్తు, అనారోగ్యం నుండి కోలుకుంటున్నాయని , మరో 3 కోడేలు ఆరోగ్య పరిస్థితి క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నట్లు చెప్పారు. కొత్తగా ఏవీ కూడా అనారోగ్యమునకు గురికాలేదని అన్నారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇక మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజన్న కోడెలపై రాజకీయం చేయవద్దని, గడిచిన పదేళ్లలో వేములవాడ ఆలయానికి సంబంధించి గత ప్రభుత్వం ఆమె ప్రశ్నించారు. ఘటనపై స్పందించి బాధ్యతాయుతంగా చర్యలు తీసుకున్నామని అయినా బురద రాజకీయాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు దిగజారుతున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు పదేళ్ల దుర్మార్గ పాలనపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆమె హితవుపలికారు. వేములవాడ రాజన్న ఆలయానికి కెసిఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మంత్రి అన్నారు.

## ఎంపీ ఈటలకు 19 ప్రశ్నలు

**కాళేశ్వరం ప్రాజెక్టు సమాచారమంతా కేసీఆర్, హరీశ్‌రావు వద్దేనని వెల్లడి**

**బలగం టీవి, హైదరాబాద్**



బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసింది. శుక్రవారం ఉదయం ఆర్కే భవన్‌లో జరిగిన ఓపెన్ కోర్టులో ఈటలను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మొత్తం 40 నిమిషాల్లో 19 ప్రశ్నలను కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ ఈటలకు వేసినట్టు తెలిసింది. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆయన మంత్రి(ఆర్థిక శాఖ)గా పని చేసిన సంగతి తెలిసిందే. దీంతో గతంలో నిర్వర్తించిన బాధ్యతల ఆధారంగా ఈటలపై కమిషన్ ఈ ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. కమిషన్ ముందు 113వ సాక్షిగా హాజరైన వ్యక్తి ఈటల రాజేందర్. తొలుత.. ఓపెన్ కోర్టులో ఈటల రాజేందర్‌తో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. బ్యారేజీ నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌లపైనే కమిషన్ ఆయన్ని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మొత్తం 19 ప్రశ్నలు వేయగా "నేనేం చేయలేదు. నాకేమీ తెలియదు. అంతా వాళ్లే చేశారు. వాళ్లకే అన్నీ తెలుసు" అని నాటి ఇరిగేషన్ శాఖను ప్రస్తావిస్తూ ఆయన వివరణ ఇచ్చుకున్నారని సమాచారం. ఈ క్రమంలో తన దగ్గర ఉన్న ఆధారాలను ఈటల కమిషన్‌కు చూపించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పని చేసిన అధికారులను మాత్రమే ఇప్పటిదాకా విచారించింది జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని కమిషన్. ఇక ఇప్పుడు రాజకీయ నేతల వంతు వచ్చింది. ఈ మేరకు.. ఈటలను తొలుత విచారించింది. మరో వైపు.. ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకూ కమిషన్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. జూన్ 5వ తేదీన జరగాల్సిన కేసీఆర్ విచారణ ఆయన విజ్ఞప్తి మేరకు 11వ తేదీకి వాయిదా పడింది. జూన్ 9వ తేదీన హరీష్ రావు కమిషన్ ముందు హాజరు కానున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు వద్దే ఉండేదని, ఆర్థిక శాఖకు ఇందులో పెద్దగా పాత్ర లేదని స్పష్టం చేశారు."కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నా పాత్ర ఏమీ లేదు" అని తేల్చిచెప్పారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కోసం కేసీఆర్ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, దానికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఛైర్మన్‌గా వ్యవహరించారని గుర్తుచేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకునే మేడిగడ్డ వద్ద ఆనకట్ట నిర్మాణం చేపట్టారని, అయితే ఆనకట్టల నిర్మాణం అనేది పూర్తిగా సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశమని, దానిపై రాజకీయ నాయకులకు అవగాహన ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు వ్యయం గురించి ప్రస్తావిస్తూ, "మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.63 వేల కోట్లతో ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్లకు పెరిగింది" అని ఈటల వివరించారు. కమిషన్ తనను ఆర్థికపరమైన అంశాలపై ప్రశ్నలు అడిగిందని, కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా అని ప్రశ్నించిందని తెలిపారు. దీనికి ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధం లేదని, ఇది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయమని తాను కమిషన్‌కు స్పష్టం చేసినట్లు చెప్పారు."నా కణతపై తుపాకీ పెట్టినా సరే.. నిజమే మాట్లాడతా. తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారు" అని ఈటల అన్నారు.

# ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు ఇప్పిస్తాం..

**-నిర్మాణాలపై ప్రతి వారం సమీక్ష**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన వారితో త్వరితగతిన పనులు మొదలు చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లాలోని ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 1413 ఇండ్లు గ్రౌండింగ్ కాగా, మిగతావి కూడా త్వరగా చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఆయా గ్రామాల వారిగా కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటివరకు గ్రౌండింగ్ పై ఆరా తీశారు. ఇండ్ల మార్క్ ఔట్ లో ఉత్తమ పనితీరు చూపుతున్న పంచాయతీ కార్యదర్శులను అభినందించారు మిగతావారు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపు ఇచ్చారు.

పేదలు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. మొదటి విడుతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తున్నదని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని, బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయనిఅన్నారు.

మంజూరు పత్రాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తుందని,సిమెంట్, స్టీల్ ధరలు తగ్గించేలా ఏర్పాట్లు చేస్తుందని వివరించారు. నిర్మాణానికి డబ్బులు లేని మహిళా సంఘాల సభ్యులకు గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా రూ. లక్ష రుణం అందిస్తామని, అందిస్తామని తెలిపారు. బేస్మెంట్, ఇతర దశలు పూర్తి కాగానే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఫోటో తీసి అప్లోడ్ చేయించాలనిఅన్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల వారిగా లబ్ధిదారులతో వాట్సాప్ గ్రూపులు పెట్టాలని సూచించారు . ఆ గ్రూపుల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తెలియజేయాలనిఅన్నారు.

**సెగ్రిగేషన్ షెడ్లు, కంపోస్టు షెడ్లు వినియోగించాలి..**

జిల్లాలోని అన్ని సెగ్రిగేషన్ షెడ్లు, కంపోస్టు షెడ్లు వినియోగించాలని డీఆర్డీఓ శేషాద్రి సూచించారు. వర్మీ కంపోస్ట్ తయారీ పై వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు వినియోగంలోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని. జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఐదు గ్రామపంచాయతీల్లో కంపోర్టు షెడ్లు నిర్మించే ఏర్పాట్లు త్వరలో చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, డీపీఓ షర్ఫుద్దీన్, డీఎల్పీఓ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు



- **కరీనగర్ మాజీ ఎంపీపీ వాసాల రమేష్**

**బలగం టీవీ, బోయినిపల్లి**

బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఆర్ఎంపీ భవన్ లో 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ సేవా సూపరిపాలన సంకల్పంతో సహకారం అనే మండల కార్యశాల నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ మాజీ ఎంపీపీ వాసాల రమేష్ రావడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వాసాల రమేష్ మాట్లాడుతూ: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చి 11 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, గడిచిన 11 సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు పేదలకు చేకూరేలా చేశారని, దేశ రక్షణ రంగంలో గాని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశాన్ని ఎంతో ప్రగతి పథంలో నడిపించిన నాయకుడిగా పేరుగాంచారు. ప్రపంచంలోనే దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలపగలిగిన మహానేతగా నిలిచారని, వీటిలో భాగంగానే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నర్సయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి,మండల మాజీ అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, అమెరి శెట్టి గంగయ్య, కిరణ్ రాజూరి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, శరత్, గంగాధర్ చారి, కొండం శ్రీనివాస్ రెడ్డి, అన్నేమల్ల మోహన్ బాబు, పాలోజు రాజేంద్రప్రసాద్, బొంగోని వినయ్, చిలువేని రమేష్ , రాచర్ల రాజేశం, నవీన్, సాయికుమార్ ,సుంకపాక ప్రభు,సారంపల్లి రాజు,కిరణ్ నాగరాజు, ధర్మేంద్ర, ప్రశాంత్, చరణ్, శ్రీశాంత్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు గత 5 నుంచి 6 నెలలుగా మెస్ ఛార్జీలు, కోడిగుడ్ల బిల్లులు, అలాగే దాదాపు నాలుగు నెలల నుంచి గౌరవ వేతనం పెండింగ్‌లో ఉన్నాయని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరో కొద్ది రోజుల్లో పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో, వంట చేయడానికి చేతిలో డబ్బులు లేక విద్యార్థులకు భోజనాలు పెట్టే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వం గౌరవ వేతనం రూ. 10,000 ఇస్తామని హామీ ఇచ్చి 15 నెలలు పూర్తయినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని కార్మికులు గుర్తు చేశారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇచ్చే రూ. 2,000 గౌరవ వేతనం కూడా దాదాపు నాలుగు నెలల నుంచి కార్మికులకు అందడం లేదని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన 5 నెలల పెండింగ్ మెస్ ఛార్జీలు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని, గౌరవ వేతనం రూ. 10,000 అమలు చేయాలని జిల్లా సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షులు ఎగమాటి ఎల్లారెడ్డి, మధ్యాహ్న భోజన రంగం జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్, మరియు కార్మికులు వసంత, సత్తవ్వ, పద్మ, ఎల్లవ్వ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలి

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**

**బలగం టీవీ, ఆదిలాబాద్**




మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న భీంపూర్ మండల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు. రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో పోలీస్ స్టేషన్లు అప్రమత్తమై విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీలో భాగంగా జైనథ్ మండలం పిప్పర్ వాడ చెక్పోస్ట్ ను కూడా జిల్లా ఎస్పీ పరిశీలించారు. చెక్పోస్ట్ గుండా అక్రమంగా పశువుల రవాణా జరగకుండా నిరోధించాలని, నిరంతరం 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో బక్రీద్ సందర్భంగా మొత్తం ఎనిమిది చెక్పోస్టులను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గ్రామాలను సందర్శిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎలాంటి సమస్యలకైనా జిల్లా పోలీసు యంత్రాంగం డయల్ 100 ద్వారా అందుబాటులో ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని తెలియజేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో ఉండే రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది చేసే విధుల పట్ల క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# దేవాలయ ఉత్సవాలకు హాజరైన కొండూరు గాంధీ..

**దేవాలయ అభివృద్ధికి విరాళామందించిన కొండూరు గాంధీ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కో-ఇన్‌చార్జ్ కొండూరు గాంధీ గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన దేవాలయ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయాల అభివృద్ధికి తన వంతు విరాళాలు అందజేసి దైవభక్తిని చాటుకున్నారు. గోరంటాల గ్రామంలో జరిగిన సాయిబాబా వార్షికోత్సవంలో కొండూరు గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సముద్రలింగాపూర్ గ్రామానికి చేరుకుని ముదిరాజుల కులదైవమైన పెద్దమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ. 10,000 విరాళాన్ని అందజేశారు. అదే గ్రామంలో యాదవుల కులదైవమైన సౌడాలమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలోనూ కొండూరు గాంధీ పాల్గొన్నారు. అమ్మవారికి రూ. 30,000 విరాళాన్ని అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆయన ఆకాంక్షించారు. కొండూరు గాంధీ దేవాలయాల అభివృద్ధికి చూపిన ఔదార్యానికి, దైవభక్తికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవీందర్ రావు జన్మదిన వేడుకలు

**పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

**అనంతరం మొక్కలు నాటిన జోగినిపల్లి రవీందర్ రావు**

**బలగం టీవీ, బోయినిపల్లి**



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి రవీందర్ రావు దంపతులు కరీంనగర్ లోని వారి నివాసంలో మొక్కలు నాటి అనంతరం హనుమాన్ ఆలయంలో, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేశారు. హరిత ప్రేమికులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన హరిత హారంలో బాగంగా మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ దంపతులు, బిఆర్ఎస్ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్ రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, మాజీజెడ్పిటిసి కొనుకటి లచ్చిరెడ్డి, జిల్లా నాయకులు అనుముల భాస్కర్, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ రాములు మాజీ సర్పంచ్ చిందం రమేష్, మాజీ మండల అధ్యక్షులు మల్లేశం మరియు మండల బిఆర్ఎస్ నాయకులు గుంటి శంకర్, రమేష్ సాగర్ మరియు హరిత సేన సభ్యులు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే అందించాలి..

**బలగం టీవీ, సిరిసిల్ల**

కార్మికులకు రావలసిన యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే అందించాలని,కార్మికులకు నిరంతరం ఉపాధితో పాటు మెరుగైన వేతనాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికుల సమస్యలపై టెక్స్టైల్ పార్కులో సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ .వి . రావు కి వినతిపత్రం సమర్పించినారు. ఈ కార్యక్రమంలో టెక్స్టైల్ పార్క్ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్ , మామిడాల శ్రీనివాస్ , రాచర్ల వేణు , పులి రమేష్ , కందికట్ల శ్రీనివాస్ , వెంకటేష్ టెక్స్టైల్ పార్క్ కార్మికులు పాల్గొన్నారు




## రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ..

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్లలో జూన్ 14, 15, 16 జరిగే సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ పిలుపునిచ్చారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని శుక్లాభవన్లో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్ స్ట్. సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు కరపత్రంను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు.ఇక్కడ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, అన్నదాసు గణేష్,గురజాల శ్రీధర్,శ్రీరాముల రమేష్, చంద్ర, నక్క దేవదాస్,బెజగం సురేష్, జిందం కమలాకర్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

## 8న కోడెల పంపిణీ..

**-అనారోగ్యం, గాయాలపాలైన జీవాలకు మెరుగైన చికిత్స అందించాలి..**

**-కోడెల కొరకు ఎమ్మార్వో, ఆర్డీవో మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు**

**-వేములవాడ తిప్పాపూర్ గోశాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం తిప్పాపూర్‌లోని గోశాలలో ఈ నెల 8వ తేదీ (ఆదివారం) అర్హులైన రైతులకు కోడెలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ రోజు వేములవాడ తిప్పాపూర్ గోశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ అనారోగ్యంతో ఉన్న జీవాలకు అందిస్తున్న చికిత్స, గోశాల నిర్వహణపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గోశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, అనారోగ్యానికి గురైన కోడెలకు అందిస్తున్న చికిత్స గురించి పశు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయాలపాలైన చిన్న కోడెలకు మెరుగైన వైద్యం అందిస్తూ, రక్తస్రావాన్ని శుభ్రం చేసి, అయోడిన్ వంటి మందులను క్రమం తప్పకుండా వాడాలని ఆదేశించారు. గోశాల ఆవరణలోని పాడైన, నిరుపయోగంగా ఉన్న ఎండు గడ్డిని వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు.

**క్రిటికల్ కండిషన్ లో ఐదు కోడెలు..**

గోశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న 17 కోడెలలో ఐదు జీవాల పరిస్థితి విషమంగా ఉందని పశు వైద్యాధికారులు కలెక్టర్‌కు వివరించారు. వాటికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన రైతులు కోడెల పంపిణీ కోసం ఆన్‌లైన్‌లో జిల్లా వెబ్‌సైట్ https://rajannasircilla.telangana.gov.in ద్వారా గానీ, ఆఫ్‌లైన్‌లో స్థానిక ఎంఆర్ఓ, ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రజలు, రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డ్ వంటి సంబంధిత ధృవ పత్రాలతో వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్, వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేయడం వల్ల కోడెలు పక్కదారి పట్టకుండా ఉంటాయని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పర్యవేక్షించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా చూసుకోవాలని ఆయన సూచించారు.

## విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ప్రభుత్వ విప్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ అనంత సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ మహోత్సవానికి భక్తులు తరలివచ్చారు

# పేదలకు ఉచిత వైద్యం అందజేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం..

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



పేదలకు ఉచిత వైద్యం అందజేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో 1 కోటి 43 లక్షలతో నిర్మితమవుతున్న 30 పడకల ఆసుపత్రి పనులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో తీసుకురావడం కోసం ఆస్పత్రి నిర్మాణం చేయడం జరుగుతుందని,వీలైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు.ఆనాడు రాజశేఖర్ రెడ్డి పెద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయాలని అరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేశారని,ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు పెంచడం జరిగిందని అన్నారు.గత ప్రభుత్వా హయంలో 400 కొట్లు ముఖ్యమంత్రి సహాయ నిది ద్వారా అందజేస్తే, ప్రజా ప్రభుత్వంలో 800 కొట్లు అందజేయడం జరిగిందని అన్నారు.రుద్రంగి మండల కేంద్రానికి 42 కోట్లతో ఏటీసి సెంటర్,200 కోట్ల తో వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు.పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన, ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని,10 సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్నా ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మన ప్రాంతంలో పేరుకు పోయిన సమస్యలను పరిష్కరి ంచుకుంటూ ముందుకు పోతున్నామని, మన ప్రాంతంలో ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్వోసి ల ద్వారా సుమారు రూ.20 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశామని అన్నారు.

**ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక**

ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ అర్బన్ మండలం చింతల్ చింతల్టాన గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు.. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో మంజూరి అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.గత ప్రభుత్వం పది సంవత్సరాలపాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేయలేదని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చెసి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.. రాష్ట్రం లోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందనీ అన్నారు.మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారనీ అన్నారు.ఇందిరమ్మ ఇల్లు పథకం పేదోడికి గొప్ప వరం లాంటిదనీ ఇల్లు లేని వారికి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లబ్ధిదారులు అందరు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి స్వంత ఇంటి కల సాకారం చేసుకోవాలని పిలుపునీచ్చారు...



# పాఠశాలల్లో డ్రాప్ ఔట్ నియంత్రణకు చర్యలు

**-బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదు చేయాలి**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా తేదీ జూన్ 6 నుండి 19 వరకు జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంపొందించడం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి బాల, బాలిక తప్పనిసరిగా పాఠశాలల్లో ఎనరోల్ అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బడిబాట కార్యక్రమం నిర్వహణ పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్వాడి ఆయా ఏఎన్ఎం వివోఏలు కలిసి ఒక టీమ్ గా ఏర్పడి ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా బాలికల ఎనరొల్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ నూతన ఉపాధ్యాయుల ద్వారా అందిస్తున్న మెరుగైన నాణ్యమైన విద్యా బోధన, వసతులు ఉచిత పుస్తకాలు యూనిఫామ్ మధ్యాహ్న భోజనం వివిధ పోటీ పరీక్షలు జేఈఈ నీట్ ఎంట్రన్స్ పరీక్ష కోచింగ్ డిజిటల్ క్లాస్ రూమ్ తరగతులు, విశాలమైన ప్లే గ్రౌండ్ మొదలగు వివరాలు తల్లిదండ్రులకు వివరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు విద్య పట్ల ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించాలని అన్నారు.

పదవ తరగతి ముగిసిన తర్వాత కూడా ఇంటర్ చదివేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల సూపర్వైజర్ వారి పరిధిలో గల బాలికల పై శ్రద్ధ వహిస్తూ వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పట్టణాలలో వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ బాల కార్మికులు తప్పకుండా చర్యలు తీసుకోవాలని, పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలలో నమోదు కావాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, హెూటల్స్, ఇట్టుక బట్టిలను తనిఖీ చేసి ఎవరైనా బాల కార్మికులు కనిపిస్తే వారిని వెంటనే పాఠశాలల్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. వలస కూలీల పిల్లలు సైతం పాఠశాలలో నమోదయ్యేలా జాగ్రత్త వహించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల కింద నమోదై జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కుటుంబంలో పిల్లలు చదువుకుంటున్నారో లేదో పరిశీలించాలని, పిల్లలు చదువుకొని పక్షంలో వెంటనే వారిని ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులుగా నమోదు చేయాలనిఅన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శేషాద్రి, జిల్లా వైద్య అధికారి రజిత ,విద్యాశాఖ అధికారులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టెస్ట్ సిరీస్‌కు టెండూల్కర్- అండర్సన్ పేరు




- సచిన్ టెండూల్కర్, అండర్సన్ లకు గౌరవ సూచకం
- బీసీసీఐ, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుల సంయుక్త నిర్ణయం
- జూన్ 11న లార్డ్స్‌లో ట్రోఫీ ఆవిష్కరించనున్న దిగ్గజాలు

**బలగం టీవి, హైదరాబాద్**

ఈ నెల 20వ తేదీ నుంచి ఇంగ్లండ్, భారత్ మధ్య చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భాగంగా విజేతలకు ఇచ్చే ట్రోఫీ పేరును మార్చాలని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది. దీనికి ? దిగ్గజాలైన 'టెండుల్కర్- అండర్సన్' ట్రోఫీగా నామకరణం చేశారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ వేళ ఈ ట్రోఫీని ఆవిష్కరించనున్నారు. ఆధునిక క్రికెట్‌లోని ఇద్దరు దిగ్గజ క్రీడాకారులు ఇంగ్లాండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్, భారత బ్యాటింగ్ లెజెండ్ సచిన్ టెండూల్కర్‌లను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బీసీసీఐ, ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సంయుక్తంగా ఈ పేరు మార్పును ప్రకటించాయి. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్‌లో ప్రారంభం కానున్న భారత పర్యటనలో ఈ కొత్త ట్రోఫీని తొలిసారిగా ప్రవేశపెట్టనున్నారు.

పపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ జూన్ 11 నుంచి ప్రారంభమవుతుంది. దానిలోని భాగంగా లార్డ్స్‌లో టెండుల్కర్- అండర్సన్? ట్రోఫీని అధికారికంగా ఆవిష్కరించనున్నారు.

టీమిండియా- ఇంగ్లండ్ మధ్య ప్రతి ఏటా టెస్ట్ సిరీస్ జరుగుతుంటాయి. ఆతిథ్య దేశాన్ని బట్టి ట్రోఫీల పేర్లు మారుతుంటాయి. ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ జరిగినప్పుడు విజేత జట్టుకు భారత మాజీ కెప్టెన్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడి పేరు మీద పటౌడి ట్రోఫీని ఇచ్చేవారు. భారత్‌లో సిరీస్ ఆడినప్పుడు విజేతకు 'ఆంథోనీ డి మెల్లో' పేరుతో ట్రోఫీ ఇచ్చేవారు. అయితే తాజాగా పటౌడీ ట్రోఫీ పేరును రిటైర్ చేయాలని అనుకుంటున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు పటౌడీ కుటుంబానికి మార్చి నెలలో లేఖ రాసింది. దీంతో త్వరలో ప్రారంభమయ్యే టెస్ట్ సిరీస్‌కు టెండుల్కర్- అండర్సన్ పేరుతో ట్రోఫీని ఇవ్వనున్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తరహాలోనే వేదికతో సంబంధం లేకుండా ఇరు జట్లు ఒకే ట్రోఫీ కోసం తలపడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ టీమిండియా తరపున 200 టెస్టు మ్యాచ్‌లు ఆడి 15,921 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు (704) తీసిన పేస్ బౌలర్ అండర్సన్ 188 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

ఇండియా క్రికెట్ టీమ్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఇంగ్లాండ్‌తో ఆడనుంది. ఈ టెస్ట్ సిరీస్ జూన్ 20 నుండి ప్రారంభం కానుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య మొదటి మ్యాచ్ జూన్ 20-25న లీడ్స్‌లో జరుగునుంది.

## తొక్కిసలాట ఘటనలో నలుగురి అరెస్టు..


**బలగం టీవి, హైదరాబాద్**

బెంగుళూరు తొక్కిసలాట ఘటనలో నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈవెంట్ మేనేజర్ నిఖిల్ సోసేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు మరో ముగ్గుర్ని అరెస్టు చేశారు. ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీ డీఎన్‌ఏకు చెందిన సునిల్ మాథ్యూ, కిరణ్, సుమంత్‌ను కూడా అరెస్టు చేశారు. ఐపీఎల్ ఈవెంట్లను సునిల్ మాథ్యూ ఆర్గనైజ్ చేస్తుంటాడు. అతను డీఎన్‌ఏ వైస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నాడు.

ఇక తొక్కిసలాట ఘటన నేపథ్యంలో పోలీసు కమీషనర్ బీ దయానందను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో సీమంత్ కుమార్ పేరును ప్రభుత్వం ప్రకటించింది. దయానంద్‌తో పాటు అదనపు కమీషనర్ వికాశ్ కుమార్ వికాశ్, డిప్యూటీ కమీషనర్ శేఖర్ హెచ్‌టీ, అసిస్టెండ్ కమీషనర్ బాలకృష్ణ, కబ్బాన్ పార్క్ ఇన్‌స్పెక్టర్ గిరీశ్ ఏకే కూడా సస్పెండ్ అయ్యారు. బెంగుళూరు సిటీ పోలీసు కొత్త కమీషనర్‌గా ఐపీఎస్ ఆఫీసర్ సీమంత్ కుమార్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎల్ విజేత ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీలో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా, 60 మంది వరకు గాయపడ్డారు.

## హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్**



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరి హర వీరమల్లు విడుదల మరోసారి వాయిదా పడింది. 'హరి హర వీర మల్లు' ఒకటి. జాగర్లమూడి క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 12న విడుదల చేయాలని భావించినా, కొన్ని కారణాల వల్ల ఆ వాయిదా పడింది. ఈ మేరకు నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు.

"అచంచలమైన ఓపిక మరియు నమ్మకంతో 'హరి హర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు మరియు సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన జూన్ 12వ తేదీకి చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాము. అయినప్పటికీ ఆ తేదీకి చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురాలేకపోతున్నామని తెలియజేస్తున్నాము. కష్టమైనయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ యొక్క ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలనేదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మేము మరి కొంత సమయం తీసుకుంటున్నాం. మీ నిరీక్షణకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం. మరోవైపు, సామాజిక మాధ్యమాల్లో 'హరి హర వీరమల్లు' చిత్రం గురించి తప్పుడు వార్తలు ప్రచారమవ్వడం మేము గమనించాం. చాలామంది తమకు తోచినది రాసేస్తున్నారు. ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని మేము ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం. దయచేసి మా అధికారిక హ్యాండిల్స్ ద్వారా మాత్రమే సినిమాకి సంబంధించిన అప్ డేట్ల కోసం వేచి ఉండండి. అప్పటి వరకు, ఎటువంటి ప్రచారాలను నిజమని భావించకండి.

'హరి హర వీరమల్లు' చిత్రం ఒక అద్భుతమైన ప్రయాణం. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి 24 గంటలూ తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ఈ ఆలస్యం మన సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ, అంతకంటే గొప్పది ఏదో రూపుదిద్దుకుంటుందని కూడా ఇది సూచిస్తుంది. ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో చిత్ర బృందం నిర్మాణాంతర కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. 'హరి హర వీరమల్లు' యొక్క భారీ మరియు శక్తివంతమైన థియేట్రికల్ ట్రైలర్ త్వరలో విడుదల కానుందని తెలియజేయడానికి మేము చాలా సంతోషిస్తున్నాం. ట్రైలర్‌తో పాటు, కొత్త విడుదల తేదీని కూడా తెలియజేస్తాం. కాబట్టి భారీ ప్రకటన కోసం వేచి ఉండండి. సినిమాపై రోజురోజుకి అంచనాలు పెరిగిపోతున్నాయి. అద్భుతమైన ట్రైలర్ ను మీతో పంచుకోవడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. అద్భుతాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి. మీ నిరంతర మద్దతు, ప్రేమ, ఓర్పుకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. తుపాను అతి త్వరలో రాబోతోంది. చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది" అంటూ చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏఎం రత్నం చిత్ర సమర్పకులు గా, ఎ. దయాకర్ రావు నిర్మాతగా నిర్మిస్తున్న ఈ మాగ్నమ్ ఓపస్ చిత్రంగా రూపొందుతోంది. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ కథానాయిక.

## 'మిత్ర మండలి' ఫస్ట్ లుక్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




టాలీవుడ్ నటుడు ప్రియదర్శి మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా ఒక కొత్త ఎంటర్‌టైనర్‌ను నిర్మించబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిత్రమండలి అంటూ ఈ సినిమాను తెరకెక్కించ బోతుండగా.. బన్నీ వాసు ఈ సినిమాను సమర్పిస్తున్నారు. సప్త అశ్వ మీడియా వర్క్స్ మరియు వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ నిహారిక కథానాయికగా నటించబోతుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్ఆర్ ధృవన్ సంగీతం అందించబోతున్నాడు. ఈ సినిమా బ్యాండ్ ట్రూప్ నేపథ్యంలో రాబోతున్నట్లు తెలుస్తుంది.

## ఘనంగా అక్కినేని అఖిల్ వివాహం

**బలగం టీవి, హైదరాబాద్**



నాగార్జున కుమారుడు అక్కినేని అఖిల్ పెండ్లి శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకి ఘనంగా జరిగింది. నూతన వధూవరులు అఖిల్ ఇంకా జైనాబ్ లు వేద మంత్రాలు సాక్షిగా పెళ్లి బంధంతో ఒకటయ్యారు. అక్కినేని నాగార్జున స్వగృహంలోనే ఈ పెళ్లి గ్రాండ్ గా జరగడం విశేషం. మరి మెగాస్టార్ చిరంజీవి ఇంకా తన వారసుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ దంపతులు ఇంకా పలువురు రాజకీయ నాయకులు సహా బిజినెస్ మ్యాగ్నెట్ పలువురు కూడా హాజరయ్యి కొత్త జంటకి తమ ఆశీస్సులు అందించారు. ఈ ఆదివారం గ్రాండ్ గా రిసెప్షన్ ని ప్లాన్ చేయగా దీనికి మరింతమంది ముఖ్య అతిథులు హాజరు కానున్నారట.



## '7 డాగ్స్' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ కలిసి నటించిన తొలి ఇంటర్నేషనల్ మూవీ 7 డాగ్స్' టీజర్ విడుదలైంది. ఈ టీజర్‌లో సూపర్‌స్టార్‌లు సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ లుక్స్ అదిరిపోయాయి. ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీ టీజర్ అదిరిపోయింది. ఈ సినిమాకి అదిల్ ఎల్ అరబీ, బిలాల్ ఫలాహ్ దర్శకత్వం వహించారు. వీళ్ళు 'బ్యాడ్ బాయ్స్ ఫర్ లైఫ్', 'మిస్ మార్వెల్' సినిమాలకి కూడా పనిచేశారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుందని వార్తలు వినిపిస్తున్నాయి, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## టామ్ క్రూజ్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు


**బలగం టీవి, హైదరాబాద్**



హాలీవుడ్ యాక్షన్ లెజెండ్ టామ్ క్రూజ్ మరోసారి తన సాహసోపేత ప్రదర్శనతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. తన తాజా చిత్రం "మిషన్: ఇంపాజిబుల్ – ది ఫైనల్ రికనింగ్" (2025) షూటింగ్ సందర్భంగా అత్యధిక బర్నింగ్ పారాచూట్ జంప్‌లు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నారు. ఈ చిత్ర షూటింగ్‌లో భాగంగా లైసెన్స్‌డ్ స్కైడైవర్ టామ్ క్రూజ్, ఏరోప్లేన్ ఇంధనంతో నిండిన పారాచూట్ సహాయంతో హెలికాప్టర్ నుంచి 16 సార్లు దూకారు. ప్రతి జంప్ తర్వాత మండుతున్న పారాచూట్‌ను కత్తిరించి, బ్యాకప్ పారాచూట్ సహాయంతో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. ఈ స్టంట్‌ను పూర్తిగా రియల్‌గా చేస్తూ, అత్యధిక రిస్క్ తీసుకున్నందుకు గిన్నిస్ రికార్డుగా నమోదైంది.

## రోడ్డు ప్రమాదంలో నటుడు టామ్ చాకో తండ్రి మృతి

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రముఖ మలయాళ నటుడు, దసరా సినిమా విలన్ షైన్ టామ్ చాకో కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వారు ప్రయాణిస్తున్న కారు తమిళనాడులో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో షైన్ టామ్ చాకో తండ్రి సి.పి. చాకో మరణించగా, నటుడు షైన్ టామ్ చాకో, ఆయన తల్లి గాయపడ్డారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే... శుక్రవారం తెల్లవారుజామున షైన్ టామ్ చాకో తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు, సోదరుడు మరియు డ్రైవర్‌తో కలిసి వారు ప్రయాణిస్తుండగా, తమిళనాడులోని ధర్మపురి సమీపంలో సేలం-బెంగళూరు జాతీయ రహదారిపై వారి వాహనం ప్రమాదానికి గురైంది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న ఒక లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. కారులో ఉన్న ఐదుగురిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, తీవ్ర గాయాలపాలైన సి.పి. చాకో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.